శుద్ధత అబద్ధమే

- అనుమతి లేకుండా ఆర్వో ప్లాంట్లు
- నాణ్యత తనిఖీ చేయని అధికారులు
- నిబంధనలు పాటించకుంటే రోగాలు తప్పవంటున్న వైద్యులు


అంబాజీపేటలో విక్రయానికి సిద్ధంగా ఉన్న వాటర్ ప్లాంట్‌లోని టిన్నులు

అంబాజీపేట: నీరు ప్రాణాధారం. అందుకే శుద్ధ జలాల కోసం ప్రజలు ఎంతైనా ఖర్చు చేస్తున్నారు. తాగునీటి కోసం శుద్ధజలాల (ఫిల్టర్ వాటర్)పై ఆధారపడాల్సి వస్తోంది. పేద, మధ్య తరగతి ప్రజలు ఫిల్టర్ వాటర్ ప్లాంట్ల వద్దకు వెళ్లి రూ.10 నుంచి రూ.15 వెచ్చించి మంచినీరు కొంటున్నారు. ఇదే అదనుగా వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు నాణ్యతకు తిలోదకాలిచ్చి సంపాదనే ధ్యేయంగా నీటి విక్రయాలు చేస్తున్నారు. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో సుమారుగా 130 పైగా వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ఇందులో అన్ని రకాల అనుమతులు పొందిన ప్లాంట్లు 35 శాతమే. ఐఎస్ఐ అనుమతులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే రూ.18 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఖర్చు చేయాలి. మూడు నెలలకోసారి ఉన్నత స్థాయి అధికారులు తనిఖీలు చేయాలి. గడువు ముగిసిన తరువాత దరఖాస్తు చేసుకోవడానికి మళ్లీ రూ.2 లక్షలు ఖర్చవుతుంది. అయితే చాలా మంది బోరు వేసి అందులో నీళ్లు పడితే చాలు రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేసి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసేస్తున్నారు. అంతే కాదు క్యాన్లు, ట్యాంకులను శుభ్రం చేయకుండా అలానే నీరు సరఫరా చేస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు..

నీటిలో సాయిల్, ఐరన్, యాసిడ్, క్లోరిన్, క్లోరైడ్ వంటి ఆమ్లాలు ఉంటాయి. ఇవి అవసరమైన దాని కంటే ఎక్కువ మోతాదులో ఉంటే ప్రజారోగ్యానికి ముప్పు. ప్లాంటులో కెమికల్ అనాలసిస్ ల్యాబ్ ఏర్పాటు చేసి, కెమిస్ట్, మైక్రో బయాలజిస్ట్‌లను నియమించుకోవాలి. వీరు ఫిల్టర్ చేసే ముందు నీటిని పరీక్షించాలి. ఫిల్టర్ అయ్యాక నీటిలోని కాఠిన్యత, లవణాలు, రంగు, రుచి పరీక్షించాకే విక్రయానికి పంపాలి. కానీ ఇవేమి జరగకుండా లేదు. బోరు నీటిని ఫిల్టర్ చేశాక వాసన లేకుండా, రుచి తెలియకుండా రసాయనాలు కలుపుతున్నారు. ఫలితంగా మినరల్స్ పూర్తిగా పోతున్నాయి. ఈ నీటిని తాగే జనం రోగ నిరోధక శక్తి తగ్గి, కాల్షియం కోల్పోయి మోకాళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. నాణ్యతలేని వాటర్ ప్లాంట్ల వద్ద నీరు తాగితే రోగాల బారిన పడక తప్పదంటున్నారు.

నాణ్యత లోపిస్తే రోగాలు తప్పవు



మినరల్ వాటర్ నిర్వహించే వారు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలతో పాటు నాణ్యతను పాటించాలి. నాణ్యత లేని మంచినీరు తాగడం వల్ల రోగాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉన్నాయి. శుద్ధి చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లను ఎంచుకుని మంచినీరు తీసుకోవాలి. అలా కాని పక్షంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

– కేఎస్ శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యుడు, అంబాజీపేట

క్లుప్తంగా

ముగిసిన కల్యాణోత్సవాలు


మాకనపాలెంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

మామిడికుదురు: ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన మాకనపాలెం అనంతలక్ష్మీ, భూదేవీ సమేత సత్యనారాయణ స్వామి వారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు శుక్రవారం స్వామి వారి చక్రస్నానంతో సంపూర్ణమయ్యాయి. చివరి రోజు కావడంతో స్వామి వారి దర్శనానికి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు స్వామి వారి వ్రతాలు ఆచరించారు. స్వామి వారి అభిషేకాలు చేయించుకున్నారు. శ్రీలక్ష్మీ గుండంలో శ్రీస్వామి వారి చక్రస్నానం ఆద్యంతం కనుల పండువలా జరిగింది. బాణసంచా కాల్పులు, మేళతాళాలు, భక్తుల కోలాహలం నడుమ ఆద్యంతం కన్నుల పండుగలా జరిగింది. భక్తుల గోవింద నామస్మరణతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం పొన్న వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు ముడుపులు, మొక్కులు చెల్లించారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం


దాత బంగార్రాజు దంపతులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామానికి చెందిన దంతులూరి సన్విత్ బంగార్రాజు, శరణ్య దంపతులు శుక్రవారం రూ.10 వేల విరాళం అందజేశారు. ఈ సొమ్మును దాత ఆలయ అర్చకుడు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

సీసీ కెమెరాల బహూకరణ


మెట్రోకెమ్ అధినేత వెంకటేశ్వరరావు అందించిన సీసీ కెమెరాలతో ఎస్సై శివకృష్ణ

పి.గన్నవరం: పోతవరం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, మెట్రోకెమ్ ఏపీఐ అధినేత నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ) శుక్రవారం పి.గన్నవరం పోలీసులకు రూ.1,73,500 విలువైన 15 సీసీ కెమెరాలను, ఇతర పరికరాలను బహూకరించారు. స్థానిక స్టేషన్లో జరిగిన కార్యక్రమంలో వీటిని ఎస్సై బి.శివకృష్ణకు అందజేశారు. సీసీ కెమెరాలను పోతవరంతో పాటు, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని బాలాజీ సూచించారు. నేరస్తులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఎస్సై శివకృష్ణ వివరించారు. వీటిని అందించిన బాలాజీకి కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్, పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు, ఎస్సై శివకృష్ణలు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో వ్యాపారస్తులు, దాతల సహకారంతో ఇంతకు ముందు 12 ప్రాంతాల్లో 33 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు ఎస్సై వివరించారు. ఇళ్లతో పాటు వ్యాపారసంస్థల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఆదర్శ రైతు నరసింహారావు మృతి


నరసింహారావు (ఫైల్)

అంబాజీపేట: కొర్లపాటివారిపాలేనికి చెందిన ఆదర్శ రైతు కొర్లపాటి నరసింహారావు (93) వృద్ధాప్యంతో ఆయన స్వగృహంలో మృతి చెందారు. కొబ్బరి తోటల సస్యరక్షణకు అంబాజీపేట పరిసర ప్రాంతాల్లో పలువురు రైతులకు నరసింహారావు ఆదర్శంగా నిలిచారు. ఆయన ఆకస్మిక మృతికి రైతు నాయకులు గణపతి వీర రాఘవులు, అరిగెల బలరామమూర్తి, నందెపు నాగేశ్వరరావు, ముత్యాల జమీల్, మేడిద శ్రీనివాసరావు, సుంకర బాలాజీ, అమలాపురం మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్టుకు తీవ్రగాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో కోరంగి వంతెన వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉన్నమట్ల గంగకు తీవ్రగాయాలయ్యాయి. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు కడియం గ్రామానికి చెందిన గంగ మట్లపాలెం ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి వెళుతుండగా అదుపుతప్పి కోరంగి వంతెన దిగువన ఉన్న రెయిలింగ్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గంగ తలకు తీవ్రగాయమైంది. హుటాహుటిన స్థానికులు క్షతగాత్రుడిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపూర్ణ పారిశుధ్యంతో మెరుగైన ఆరోగ్యం


చింతలూరులో డ్రైడే ఫ్రైడే నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది


మాచవరం హడ్కో కాలనీ డ్రైనేజీ వద్ద దోమల నివారణకు ప్రజలకు వివరిస్తున్న సీహెచ్ఓ అప్పారావు

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడివారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధించవచ్చని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీకాంత్, డి.సాయికిషోర్ అన్నారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

మాచవరంలో..

అంబాజీపేట: నివాస ప్రాంతాల మధ్య ఉన్న డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడం వల్ల దోమల ఉధృతి తగ్గుతుందని సీహెచ్ఓ బి.అప్పారావు అన్నారు. మాచవరం శివారు హడ్కో కాలనీలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సీహెచ్ఓ బి.అప్పారావు మాట్లాడుతూ మురుగు కాలువలను శుభ్రం చేసుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తే దోమలు వృద్ధి చెంది పెరిగిపోతాయన్నారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ పారిశుధ్య పనులు చేసుకోవాలన్నారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాలను పురస్కరించుకుని కంటికి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కంటి రోగాలు వచ్చిన వారు అలసత్వం వహించకుండా జాగ్రత్తలు తీసుకుంటే కంటి చూపు కోల్పోరన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు బాసటగా భవిత కేంద్రాలు


ఆలమూరులోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎంపీడీఓ రాజు, పారా సంస్థ

ఆలమూరు: మానవ శరీరంలో అవయవాలు లోపించడంతో పాటు మానసికంగా నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న దివ్యాంగ పిల్లలకు భవిత కేంద్రాలు బాసటగా నిలుస్తున్నాయని ఎంపీడీవో ఎ.రాజు అన్నారు. ఆలమూరులోని దివ్యాంగుల పాఠశాల (భవిత కేంద్రం)లో శుక్రవారం రావులపాలేనికి చెందిన పారా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులకు కేర్ గివెర్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల కోఆర్డినేటర్ బడుగు మహిమారావు, ఎంపీడీఓ రాజు మాట్లాడుతూ చిన్నారులపై తల్లిదండ్రులు శ్రద్ధ వహిస్తూ వారి పనిని వారు చేసుకుంటూ వాళ్ల కాళ్ల మీద వారే నిలబడి కాలకృత్యాలు తీర్చుకునే శిక్షణను తెలియజేయాలన్నారు. అలాగే దివ్యాంగుల జీవితంలో మనోధైర్యాన్ని కలగజేస్తూ ముందుకు సాగే విధంగా ప్రోత్సహించాలన్నారు. అదే విధంగా విభిన్న ప్రతిభావంతుల హక్కుల నేత బడుగు సుబ్బాయమ్మ పాల్గొని విభిన్న ప్రతిభావంతులకు సంబంధించిన హక్కులు, సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలైన దివ్యాంగ విద్యార్థులకు బహుమతుల పంపిణీ జరిగింది. ఐఈఆర్‌డీ ఉపాధ్యాయుడు విజయ్ కిరణ్, బ్లాక్ కోఆర్డినేటర్ జి.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కాశీలో ఘనంగా ముగిసిన శివనామ సంకీర్తన


కాశీలో గరిమెళ్లకు నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు, జిల్లా భక్తులు

కొత్తపేట: సనాతన ధర్మ ప్రచార వాగ్గేయకార సంకీర్తనా వాహిని సేవా సమితి ఆధ్వర్యంలో శివనామ సంకీర్తన సప్తాహ ధ్యాన మహోత్సవం శుక్రవారం ఘనంగా ముగిసింది. ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం ఆస్థాన అన్నమాచార్య సంకీర్తనాచారి కరుటూరి వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అంకంపాలెం, తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం శ్రీరంగపటం గ్రామాల నుంచి 200 మంది భక్తులు ఈనెల 4న కాశీ యాత్రకు బయలుదేరి వెళ్లిన విషయం తెలిసిందే. 2015 నుంచి ప్రారంభమైన సనాతన ధర్మ ప్రచార రథయాత్ర 2027 సంవత్సరం గోదావరి పుష్కరాలకు 12 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా 9 రోజులు పాటు కాశీ క్షేత్రం కన్నప్ప మఠం శివనామ సంకీర్తన సప్తాహ ధ్యాన మహోత్సవం వైభవంగా పూర్ణాహుతితో అద్భుతంగా పూర్తి చేసినట్టు నిర్వాహకుడు శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమాలతో భక్తులు తన్మయత్వం చెందారని, కాశీయాత్ర పట్ల సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ మృతికి కాశీ క్షేత్రం కేదార్‌ఘాట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించామన్నారు. అనంతరం గరిమెళ్ళ స్వరపరిచిన అన్నమయ్య కీర్తనలను ఆలపించినట్టు శ్రీనివాసరావు తెలిపారు.

ఆదర్శ దంపతుల అవార్డు స్వీకరణ


ఆదర్శ దంపతుల అవార్డును స్వీకరిస్తున్న గారపాటి దంపతులు

ఆలమూరు: మండలంలోని పెదపళ్లకు చెందిన గారపాటి శ్రీనివాసు, పద్మజ దంపతులిద్దరూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మకమైన ఆదర్శ దంపతుల అవార్డు స్వీకరించారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని ప్రముఖ కళారంగ సంస్థ యువ ఆర్ట్స్ థియేటర్స్ ఏటా మాదిరిగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి వివిధ రంగాల్లో విశేష సేవలను అందించిన దంపతులను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. అందులో భాగంగా సేవా, సామాజిక రంగాల్లో విశేష సేవలందించిన గారపాటి దంపతులు స్త్రీశక్తి, సేవామూర్తి విభాగంలో ఈ అవార్డుకు ఎంపికయ్యారు. దీంతో గురువారం రాత్రి హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు తెలంగాణ తొలి శాసన సభాపతి ఎస్.మధుసూదనాచారి, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, హైకోర్టు న్యాయవాది ఎం.వెంకటేశ్వరి, ప్రముఖ గాయని మధుప్రియ, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు వెన్నెల గద్దర్ తదితరులు చేతుల మీదుగా గారపాటి దంపతులు అవార్డులు స్వీకరించారు. ఆదర్శ దంపతుల అవార్డు పట్ల పలువురు నేతలు పార్టీలకతీతంగా అభినందనలు తెలియజేశారు.

పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరాకు చర్యలు


కొత్తపేటలో తాగునీటి పథకం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితరులు

కొత్తపేట: నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. జల్ జీవన్ మిషన్ (జేజేఎం) ద్వారా కొత్తపేట పంచాయతీ పరిధిలోని పనసలదొడ్డిలో రూ.57.20 లక్షలతో, పెదగూళ్లపాలెం గ్రామంలో రూ.57.20 లక్షలతో, మందపల్లిలో రూ.66 లక్షలతో రక్షిత మంచినీటి పథకాల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే బండారు శంకుస్థాపన చేశారు. మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రూ.24 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మార్గన గంగాధరరావు, వైస్ ఎంపీపీ దంగేటి వెంకటనాగమణి, సర్పంచ్ బూసి జయలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మిద్దే ఆదినారాయణ, ఎంపీటీసీలు సిద్దంశెట్టి వీవీ సత్యనారాయణ, మందపల్లి వైఎస్సార్ సీపీ నాయకుడు సాదు చెంచయ్య, పంచాయతీ సభ్యుడు విళ్ల మారుతీప్రసాద్, బూసి మరియమ్మ, బీర ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు. ఆత్రేయపురం మండలం మెర్లపాలెం శివారు వాసంశెట్టివారిపాలెంలో రూ.24 లక్షలతో నిర్మించే ఎంపీపీ ప్రాథమిక పాఠశాల అదనపు గదులకు ఎమ్మెల్యే బండారు శంకుస్థాపన చేశారు. పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి


పశువైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఉపసంచాలకుడు మూర్తి, వైద్య సిబ్బంది

మలికిపురం: పశువులకు వివిధ వ్యాధులు రాకుండా ప్రభుత్వం ఇచ్చే టీకాలు తప్పనిసరిగా రైతులు వేయించాలని అమలాపురం పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ కేఎస్‌వీవీఎస్ మూర్తి సూచించారు. మండలంలోని మేడిచర్లపాలెంలో ఆవులకు, గేదెలకు గాళ్ల టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ వ్యాధి నిరోధక చర్యల్లో భాగంగా ప్రతి ఏటా రెండుసార్లు గాళ్ల టీకాలు వేయించుకుని వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ప్రతి రైతు సహకరించాలన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులలో పాలు దిగుబడి పూర్తిగా తగ్గిపోకుండా ముందు జాగ్రత్తగా ప్రతి పశువులకు టీకాలు వేయవలసిన అవసరం ఉందన్నారు. అలాగే రైతులకు అండగా ఉండడానికి పాడి పశువులకు తప్పనిసరిగా ప్రభుత్వ ఇన్సూరెన్స్ 80% శాతం రాయితీలో చేయించుకోవాలన్నారు. ఇందులో ఇన్సూరెన్స్ ప్రీమియం రూ.1920 కాగా రైతు 398 రూపాయలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. మేలు జాతి పశువులకు లక్ష రూపాయలు వరకూ భీమా సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో రైతులు బి.ఆది సత్యనారాయణ, పి.సత్యనారాయణ, కె.సుధాకర్, ఎం.సత్యనారాయణ సిబ్బంది ప్రేమ్, రవిబాబు పాల్గొన్నారు.

బంగారం, నగదు చోరీ

అమలాపురం రూరల్: తాండవపల్లి గ్రామ పరిధి శెట్టిపల్లి వనువులమ్మ ఆలయం సమీపంలో గురువారం అర్ధరాత్రి ఒక ఇంట్లో దొంగలు చొరబడి చోరీకి పాల్పడ్డారు. అమలాపురం తాలూకా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తటవర్తి వెంకటరత్నం 13వ తేదీన ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. మరుసటి రోజు శుక్రవారం తెల్లవారు జామున వచ్చేసరికి ఇంటి తాళాలు తీసి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దాచిన రూ.10 వేల నగదు, ఎనిమిది గ్రాముల బంగారం బిస్కెట్ మాయమైనట్లు గుర్తించారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంకటరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ ఏసుబాబు తెలిపారు.

మసీదులో ప్రత్యేక ప్రార్థనలు


రాజోలు జామియా మసీదులో ఇఫ్తార్ విందు

రాజోలు: రంజాన్ మాసం పురస్కరించుకుని రాజోలు జామియా మసీదులో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదు గురువు చాన్ రంజాన్ మాసం విశిష్టత వివరించారు. మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మసీదు కమిటీ సభ్యులు బాజీ, సిలార్, మున్నా, ఇబ్రహీమ్, గురువు చాన్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్(బజ్జీలు సాహెబ్) తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: పవిత్ర రంజాన్ నెలలో రెండో శుక్రవారం నమాజ్ ప్రార్థనలు జరిగాయి. మామిడికుదురు సున్నీ జామియా మసీదుతో పాటు షియా జామియా మసీదులో మత ప్రబోధకుడు తారిఖ్ అన్వర్ రజ్వీ, షబ్బర్ అలీజైదీ శుక్రవారం ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. తెలిసీ, తెలియక చేసిన పాపాల నుంచి పునీతులు కావాలని అభిలషించారు. మండలంలోని పెదపట్నం, మొగలికుదురు, కొమరాడ, మగటపల్లి మసీదుల్లో కూడా రంజాన్ నమాజ్‌లు జరిగాయి. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు నమాజ్ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఊడిమూడి వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడిగా 'కోట'


ఏడుకొండలును అభినందిస్తున్న పార్టీ నాయకులు

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ ఊడిమూడి గ్రామ శాఖ అధ్యక్షుడిగా కోట ఏడుకొండలు ఎన్నికయ్యారు. పార్టీ నాయకుడు పందిరి పూర్ణచంద్రరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో గ్రామశాఖ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ప్రధాన కార్యదర్శులుగా యనమదల ఏడుకొండలు, కొల్లు కృష్ణ, ఆదిమూలం వెంకటేశ్వరరావు, నేతల శ్రీను తదితరులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పార్టీ నాయకులు అభినందించారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు గిడ్డి రాంబాబు, కొల్లు రాంబాబు, సాధనాల రమేష్, రాణి శ్రీధర్, చింతా శంకరం, మేడిశెట్టి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి కోఆర్డినేటర్ పరామర్శ


దొరబాబును పరామర్శిస్తున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

అయినవిల్లి: ఇటీవల బిల్డింగ్ పై నుంచి పడిపోయిన అయినవిల్లి మండలం కె.జగన్నాథపురం గ్రామానికి చెందిన పంపాటి దొరబాబును వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజక వర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు శుక్రవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామానికి చెందిన ఇటీవల యాక్సిడెంట్‌కి గురైన రాయి ధనరాజ్‌ను పరామర్శించారు. ఆయనతో పాటుతో పాటు మండల అధ్యక్షుడు కుడిపూడి విద్యాసాగర్, స్థానిక సర్పంచ్ మేడిశెట్టి ఉష, నాయకులు మేడిశెట్టి శ్రీను, కాశి వీవీ సూర్యనారాయణ, కడలి భూపతి, కమిడి వెంకటేశ్వరరావు, మిండగుదిటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామానికి చెందిన అత్తిలి ఊదలయ్య అనే వ్యక్తిని 5 లీటర్ల సారాతో అరెస్టు చేసినట్టు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై కె.అన్నవరం ఆధ్వర్యంలో ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో భాగంగా 5 లీటర్ల సారా కలిగి ఉన్న ఊదలయ్యను అదుపులోకి తీసుకుని, సారా స్వాధీనం చేసుకుని కొత్తపేట మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.